క్లుప్తంగా

సన్మార్గంలో నడవాలి


ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ప్రతి ముస్లిం ప్రవక్త చూపిన సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. సోమవారం జరిగే బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాంలో అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగల్లో ఒకటైన బక్రీద్ త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. భక్తిశ్రద్ధలతో పండగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

గోపాలవనంలో గోపూజలు

మదనపల్లె : మండలంలోని బైపాస్‌రోడ్డు కొండామర్రిపల్లె చెరువుకు పడమర ఉన్నటువంటి గోపాలవనంలో సోమవారం ఉదయం గోపూజలు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ వరదారెడ్డి నారదరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...గోమాత పుట్టినరోజు పండుగ సందర్భంగా గో ప్రాశస్త్యం, ప్రాముఖ్యత పదిమందికీ తెలపాలనే సదుద్దేశంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులసంఘం, అగ్రి ఆర్గానిక్ డెవలపర్ పెరవలి రాజశేఖర్‌నాయుడుకు చెందిన గోపాలవనంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి పట్టణ ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు

బి.కొత్తకోట: స్థానిక దారుల్ తౌహిద్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు బి.కొత్తకోట నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, పేదలు 90 మంది దుస్తులను అందించారు. తౌహిద్ మసీదు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ 60 మంది కార్మికులకు, 30 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టిన సంఘ సభ్యులను అతిథులు సత్కరించారు.

ఘనంగా ఫాదర్స్‌డే


మాట్లాడుతున్న ప్రముఖ కవి నాగరాజ

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని జిజ్ఞాస భవనంలో ఆదివారం అంతర్జాతీయ నాన్నల దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ కవి వీఎం నాగరాజ నాన్న ప్రత్యేకతను వివరించారు. రచయితలు కరుణాకర్, గుర్రం రామ మోహన్‌నాయుడు నాన్న గొప్పతనం, విశిష్టతను తెలియజేశారు. పలువురు రచయితలు నాన్న దినోత్సవం పురస్కరించుకుని కవితలు వినిపించారు.

విశ్రాంత ఉద్యోగి మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పట్టణంలోని తోటవీధికి చెందిన ఆర్‌అండ్‌బి విశ్రాంత ఉద్యోగి మురాష వలి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢసానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చింతల వెంట చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, అబ్దుల్ కలీం, ఖాదరి, తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా రాజేష్

రాజంపేట టౌన్ : ఆర్యవైశ్య యువజన సంఘం రాజంపేటశాఖ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన బొగ్గరపు రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధుల సమావేశంలో రాజేష్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడంతోపాటు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో కమిటీ సభ్యులను నియమించనున్నట్లు రాజేష్ తెలిపారు.

నేడు ద్రౌపది కల్యాణోత్సవం

రామాపురం : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహాభారతి యజ్ఞంలో భాగంగా ఆదివారం ద్రౌపది మాత కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు మహాభారతం కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ద్రౌపది మాత తరఫున పలువురు దాతలు, పాండవుల తరఫున దాతలు పాల్గొని కల్యాణ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. అందువలన మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున ద్రౌపది మాత కల్యాణోత్సవానికి హాజరై కల్యాణ ఉత్సవాన్ని తిలకించాలని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజూ మాదిరే అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

బక్రీద్‌కు ఈద్గాలు, మసీదులు సిద్ధం

-ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

మదనపల్లె సిటీ: త్యాగానికి ప్రతీకగా భాసిల్లే బక్రీద్ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులోని ఈద్గా లో ముస్లిం సోదరులు సామూహికంగా ప్రార్థనలు చేస్తారు. ఇందు కోసం ఈద్గా మైదానం శుభ్రం చేశారు. ప్రార్థనల కోసం ప్రత్యేకంగా షామియానాలు, నీటి వసతి ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటలకు స్థానిక బెంగళూరు బస్టాండు నుంచి ముస్లిం సోదరులు తక్బీర్ పఠిస్తూ సామూహికంగా ప్రార్థనలకు బయలుదేరుతారు. ఉదయం 7.30 గంటలకు ఈద్‌గాలోజామియా మసీదు మత పెద్ద మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్ ధార్మిక ఉపన్యాసం చేస్తారు. ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఉదయం 8 గంటలకు బెంగళూరు బస్టాండు వద్దనున్న జామియా మసీదులో ప్రార్థనలు, ఉదయం 6.30 గంటలకు స్థానిక సల్మాన్‌ఫార్సీ మసీదు, ఉదయం 9 గంటలకు స్థానిక డ్రైవర్స్ కాలనీలోని ఈద్‌గాలో ప్రార్థనలు నిర్వహిస్తారు. ముస్లిం సోదరులు సంతల్లో పొట్టేళ్లు, మేకలు, గొర్రెలను తీసుకువచ్చారు. ప్రీతిపాత్రమైన ఖుర్బానీ మాంసాన్ని బంధువులు, పేదలకు పంపిణీ చేసి వారి ఇళ్లల్లోనూ సంతోషాలు నింపేందుకు ప్రయత్నిస్తున్నారు.


బక్రీద్ ప్రార్థనలకు సిద్ధమైన నక్కలదిన్నెలోని ఈద్గా

హజ్‌తో పవిత్రత



ప్రతి ముస్లిం సోదరులు జీవితంలో ఒక్కసారైనా మక్కా,మదీనా సందర్శించాలి. తద్వారా వారి పాప విమోచనం జరుగుతుంది. తల్లిగర్భం నుంచి వచ్చిన బిడ్డ ఎంత స్వచ్ఛంగా ఉంటాడో హజ్, ఉమ్రా చేసి వచ్చిన వారు అంత స్వచ్ఛదంగా,పవిత్రంగా ఉంటారని ప్రవక్త ఖురాన్‌లో బోధించారు. **-హాజీ ఇక్బాల్ అహ్మద్, ప్రభుత్వ సర్‌ఖాజీ, మదనపల్లె**

ప్రజలకు అందుబాటులో ఉంటా

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


రామసముద్రంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

రామసముద్రం: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక రామసముద్రం టీటీడీ కల్యాణ మండపంలో ఎమ్మెల్యేకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన తొలుత కర్ణాటక రాష్ట్రం కురుడుమలైలో వెలసిన శ్రీవినాయకస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామసముద్రం మండలంలో విద్య, వైద్య , వ్యవసాయంతో పాటు ప్రజలు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. 10 రోజులకోకసారి మండలానికి వచ్చి అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రామసముద్రం-మదనపల్లెకు ఉన్న రోడ్డును విస్తరణ చేస్తామన్నారు. మండలానికి హంద్రీనీవా జలాలు తెప్పించి వ్యవసాయ రంగం అభివృద్ధితో పాటు తాగునీటికి సమస్య లేకుండ చేస్తామన్నారు. మండల పర్యటన చేసి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొండూరు నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామిరెడ్డి, బద్రీ, జయకుమార్, ప్రశాంత్, రూపేష్, కృష్ణంరాజు, చిన్నుస్వామి, రాజేష్, శివశంకర్, సీతారామయ్య, పెద్దిరెడ్డి, అల్తాఫ్, పవన్, కృష్ణప్ప, కోవకృష్ణమూర్తి, రామ్మూర్తి, జంగాలపల్లి శ్రీనివాసులు, రామచంద్ర పాల్గొన్నారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి

వాల్మీకిపురం: ధనిక, పేద బేధం లేకుండా ప్రతి ఒక్కరూ బక్రీద్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆల్ మదద్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షులు నయీముద్దీన్ అన్నారు. ఆదివారం స్థానిక నాయక్‌వీధిలోని దర్గా ప్రాంగణంలో 175 మంది పేద ముస్లిం వితంతువులకు బక్రీద్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా, బక్రీద్ తోఫా పేదవారికి అందిస్తున్నామని, ట్రస్టు ద్వారా పేదవారి వివాహాలకు నగదు సహాయం, వైద్య ఖర్చులు భవిష్యత్తులో ట్రస్టు ద్వారా మరిన్ని కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నసీముల్లా బాషా, సందాని, ఖలందర్, కిజర్, ఇర్ఫాన్, తాహీర్ తదితరులు పాల్గొన్నారు.


బక్రీద్ తోఫాను అందజేస్తున్న ఆల్ మదద్ ఎడ్యుకేషనల్ ట్రస్టు సభ్యులు

అపోహలు వీడి రక్తదానం చేయాలి

మదనపల్లె సిటీ: యువతీ ,యువకులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వెల్‌విషర్స్ సంస్థ వ్యవస్థాపకులు గిరీష్ అన్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రక్తం ఇస్తేనే రక్త సంబంధీకులు అవుతారన్నారు. కుల,మత ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని వారు కోరారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. రక్తదానం చేయడంలో ఎంతో గొప్ప సేవ ఉందన్నారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు దినకర్, రెడ్డి, హరి,బ్లడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న వెల్‌విషర్స్ సభ్యులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

మదనపల్లె : త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. దైవప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతి స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, భద్రతా భావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. మతసామరస్యం వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

బక్రీద్ శుభాకాంక్షలు

బక్రీద్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ ఆకాంక్షించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా పండుగ చేసుకోవాలన్నారు. ప్రజలందరూ సుఖశాంతులు, ఆరోగ్యంతో ఉండేలా భగవంతుడు కరుణించాలని కోరుకున్నారు. నియోజకవర్గ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

జాంబవంతుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసివున్న జాంబవంతుడికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం నిర్వహించి స్వాములవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణతో వర్తక సంఘం వారు ఉభయదాతలుగా ఈ బ్రహ్మోత్సవాలను ప్రారంభించినట్లు ఆలయ చైర్మన్ సుబ్బయ్య, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్యలు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. కాగా నూతనంగా ఆలయ చైర్మన్‌గా జిలకల సుబ్బయ్య సోమవారం రాత్రి 9 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు గ్రామ పురోహితుడు తెలియజేశారు.

ఎమ్మెల్యే కిషోర్‌ను సత్కరించిన మంత్రి మండిపల్లె

పీలేరు : పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డిని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సత్కరించారు. ఆదివారం నగిరిపల్లెలో ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. అలాగే తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందడం తోపాటు రాష్ట్ర రవాణా, యువజన క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాంప్రసాద్‌రెడ్డికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేని కలసిన మీసేవా నిర్వాహకులు

పీలేరు మండలానికి చెందిన మీసేవా నిర్వాహకులు ఆదివారం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీసేవా కేంద్రాలు నిర్వహణ గడ్డు పరిస్థితి ఎదుర్కొన్నామని చెప్పారు. తిరిగి 2019 కంటే ముందు ఉన్న సర్వీసులు అందించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో మీ సేవా నిర్వాహకులు శ్రీధర్, మహమ్మద్ పీర్, ఖాదర్‌వలి, గిరి, రమణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

జిల్లా బాలుర సీనియర్ హాకీ జట్టు ఎంపిక


జిల్లా బాలుర సీనియర్ హాకీ జట్టుతో హాకీ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె సిటీ: స్థానిక బీటీ కాలేజీలోని జినరాజదస హాకీ స్టేడియంలో ఆదివారం జిల్లా బాలుర సీనియర్ హాకీ జట్టు ఎంపిక చేశారు. అన్నమయ్య హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 27 నుంచి 31 వరకు ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హాకీ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారి వివరాలు ప్రకటించారు. జి.రెడ్డి జయప్రకాష్, ఓ.రెడ్డిప్రసాద్, జె.రవితేజ, పి.రోహిత్, వి.సాయికిరణ్, పి.వెంకటసాయి, ఎన్.వెంకట్, కె.భానుప్రకాష్, బి.గంగాధర్‌రెడ్డి, బి.వెంకటనారాయణ, పి.సందీప్‌కుమార్‌రాజు, కె.విశాల్‌వర్మ, కె.అశోక్, కె.బాబాఫకృద్దీన్, జి.నవీన్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ది హాకీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ పీడీ పి.ప్రసాద్‌రెడ్డి, నవీన్,హితేష్, భాస్కర, హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నడివీధి గంగమ్మ జాతర


కలికిరి: బోనాలు తీసుకెళుతున్న మహిళలు


తంబళ్లపల్లె: పూజలు నిర్వహిస్తున్న లక్ష్మన్న

కలికిరి: మండలంలోని చీకటిపల్లి గ్రామ పంచాయతీ రంగనాథపురంలో ఆదివానం ఘనంగా నడివీధి గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో జాతరను పురస్కరించుకుని సందడి నెలకొంది.

ఘనంగా గిండి గంగమ్మ జాతర

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె బస్టాండు సమీపంలో వెలసిన గిండి గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారి లక్ష్మన్న అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. పరిసర ప్రాంతాల మహిళలు నియమ నిష్టలతో భక్తిభావంతో దీలు,బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి చాందీబండ్ల మెరవణీ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి.

రెడ్డెమ్మతల్లీ.. కరుణించమ్మా


అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారికి భకిత్ శద్ధలతో మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పొట్టేళ్లు, మేకపోతులకు భలే గిరాకీ

పీలేరు రూరల్ : బక్రీద్ పండుగ నేపథ్యంలో పొట్టేళ్లకు, మేకపోతులకు భలే గిరాకీ ఏర్పడింది. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన గొర్రెల సంతలో ధరలు ఆకాశాన్నంటాయి. మంచి రకం పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్ ఏర్పడింది. బక్రీద్ కావడంతో పక్క రాష్ట్రం తమిళనాడు, కర్నాటక రాష్ట్ర నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పొట్టేళ్లు రూ. 20 వేల నుంచి రూ. 90 వేలు ధర పలికాయి. వ్యాపారులు, రైతులతో వారపు సంత కిటకిటలాడింది.


వారపు సంతలో పొట్టేళ్లు

అలనాటి జ్ఞాపకాలు

గుర్రంకొండ: నాటి బియ్యపు యంత్రాలుగా పిలిచే వడ్లు దంచే రోళ్ల చరిత్ర పుటల్లో కలిసిపోయాయి. నాటి నాగరికతకు చిహ్నాలుగా ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఒకటో అరో ఇలాంటి రోళ్లు నేటికి దర్శనమిస్తున్నాయి. కరెంటు సరఫరా లేని కాలంలో వరిధాన్యాన్ని (వడ్లు) రోళ్లలో వేసి దంచి బియ్యాన్ని తీసేవారు. గ్రామాల్లోని వీధుల్లో వీటిని అక్కడక్కడా ఏర్పాటు చేసుకొనేవారు. పూర్వకాలంలో ఊరికి తాగునీటి సౌకర్యార్థం చేదబావిలో ఎలా ఏర్పాటు చేసేవారో వడ్లను దంచే రోళ్లను కూడా అలాగే ఏర్పాటు చేసుకొనేవారు. అప్పట్లో వీటిని అవసరమైన వారు వినియోగించు కొనేవారు. ఎంతటి వారైనా బియ్యం కావాలంటే ఈ విసురు రోళ్లలో వడ్లు వేయాల్సిందే. పండుగలు, పబ్బాలు వచ్చాయంటే వీటి దగ్గర జనాలు ఎక్కువగా ఉండేవారని గ్రామాల్లో వయసు మీరిన పెద్దలు చెప్పుకొంటూ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొంటున్నారు.


జ్ఞాపకాలుగా మిగిలిపోయిన వడ్లుదంచే రోళు

ప్రతీకార చర్యలు ఆపి అభివృద్ధిపై దృష్టిపెట్టాలి


ఎంపీ మిథున్‌రెడ్డికి గజమాలవేసి ఘనస్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

రైల్వేకోడూరు : కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకువచ్చి తనవంతు అభివృద్ధి చేస్తానని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డితో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ఐదు సంవత్సరాలలో అన్నమయ్య జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రజాతీర్పును గౌరవించి అధికార పార్టీలవారు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. అధికారం శాశ్వతం కాదని ప్రతి ఒక్కరం ప్రజల పక్షాన నిలబడి వారికి సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ఎంపీగా అధికార పార్టీ ప్రతిపక్షాలు తేడా లేకుండా ప్రతి ఒక్కరికి సహాయం చేశామని చెప్పారు. ప్రజలకు అవన్నీ గుర్తుంటాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన విషయాలు గుర్తుంటాయని, తనను ఎంపీగా గెలిపించిన ఓటర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రైల్వేకోడూరులోని సర్పంచ్‌లు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి శాలువా కప్పి గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముద్దా బాబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, సహదేవరెడ్డి, ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజు, వైఎస్ అన్వర్‌బాషా, సిద్దయ్య, సుబ్బరామరాజు, మండల నాగేంద్ర, సర్పంచ్‌లు చంద్రశేఖర్, హరిక్రిష్ణారెడ్డి, గోపి, శివయ్య, సుబ్రమణ్యం రాజులు, ఎంపీటీసీలు బండారు మల్లి, జనార్దన్‌రాజులు, మలిశెట్టి వెంకటరమణ, రౌఫ్, కరీముల్లా, ఆర్‌వి.రమణ, రాజారెడ్డి, క్రిష్ణారెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, డమ్ము రఘు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగారపమ్మ తిరునాల

సుండుపల్లె : నాగారపమ్మ తిరునాల మహోత్సవం ఘనంగా సాగుతోంది. ఈ మహోత్సవానికి పక్క జిల్లాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని పూజించుకున్నారు. తిరునాలలో భాగంగా సోమవారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనభాగ్యాన్ని కల్పించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. రాయచోటి డిపో నుంచి తిరునాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.

మారమ్మకు పొంగళ్లు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి పొంగళ్ల మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. మహోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ధర్మకర్తలు శింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గా ప్రసాద్‌రెడ్డి, ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువా పూలమాలతో సత్కరించారు. మహిళలు తెల్లవారుజాము నుంచే ఆలయ ఆవరణలో పొంగళ్లను తయారు చేసి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, తుమ్మల శ్రీధర్‌గౌడ్, అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, అరిగే నాని, ఓట్స్ శ్రీనివాసులు, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర తదితరులు పాల్గొన్నారు.